క్లుప్తంగా

విజయవంతం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లటౌన్: ఈనెల 3న లహరీ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే కామ్రేడ్ సామల మల్లేశం సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో సంతాప సభ కరపత్రాన్ని విడుదల చేశారు. సభకు కార్మికులు, కర్షకులు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, అజ్జ వేణు, సోమ నాగరాజు, లింగం, నల్ల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో సబిత

బోయినపల్లి: చెరువు మట్టితో చేనుకు బలం చేకూరుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో వనం సబిత పేర్కొన్నారు. మండలంలోని తడగొండ నల్లకుంట చెరువులో ఉపాధిహామీ పనులను శనివారం పరిశీలించారు. ఎంత మంది కూలీలు పని చేస్తున్నారో తెలుసుకున్నారు. ఆమెవెంట పంచాయతీ కార్యదర్శి మల్లేశం తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లో శనివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మొటాటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు తీశారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పాడి పంటలు పండాలని వేడుకున్నారు. గ్రామంలోని రెడ్డి సంఘం మహిళలు ఇంటికో బోనంతో గ్రామ పుర వీధులగుండా ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల వద్ద బోనం మొక్కులు చెల్లించారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. దారి పొడవునా బైండ్లవారి విన్యాసాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెడ్డి సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి

ముస్తాబాద్: ప్రభుత్వం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 60 ఏళ్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్ష, ఉద్యమాన్ని గౌరవించి, సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మండలకేంద్రంలో జరిగే ఉత్సవాలకు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆలయంలో అభిషేక పూజలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవంలో భాగంగా శనివారం శ్రీ రాజరాజేశ్వరస్వామి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవతాహవనం, అయ్యప్ప, సాయిబాబా స్వాములవార్లకు మహా అభిషేక పూజలు, మూలమంత్ర హవనం, మహా పూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప ముస్తాబాద్ రాజు గురుస్వామి చేతులమీదుగా పడిపూజ నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం ఆలయ వార్షికోత్సవ వేడుకలు ముగిసినట్లు పండితులు తెలిపారు. కార్యక్రమంలో పండితులు గుండయ్య శర్మ, ఆలయ కమిటీ సభ్యులు అల్లాడి మురళి, బొమ్మకంటి భాస్కర్, చకిలం మధు, తాటిపల్లి సుధాకర్, గంప నాగేందర్, రాజేశం, రాజు, బచ్చు శ్రీనివాస్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట: మండలంలోని మంగళ్లపల్లిలో మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా వెలిశాల లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సాసాల సాయిచరణ్, కోశాధికారిగా బొంబాయి మల్లయ్య, కార్యదర్శిగా అవురం నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా ఆది దేవయ్య, ఆది పర్శరాములు, నంది రాములు, వెలిశాల అంజయ్య, సీతారాం నాగరాజు, ఉప్పుల మహేశ్ ఎన్నికయ్యారు.

పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన రోద్ద రాములు, మిర్యాల్‌కర్ పద్మ అనా రోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. నాయకులు పర్శరాములుగౌడ్, కల్యాణ్, ఎడ్ల సందీప్ తదితరులున్నారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన కొండ నర్సవ్వ (75) శనివారం మృతిచెందింది. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు కూడా చిల్లిగవ్వ లేక వైకుంఠధామానికి మృతదేహాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియాలు నిర్వహించారు. మృతురాలికి కొడుకు గణేశ్, కోడలు అం

చదువులో ‘అగ్ర’హారం

- ఉన్నత విద్యా ప్రయాణంలో 37 వసంతాలు
- కార్మిక, ధార్మిక క్షేత్రానికి విద్యా వెలుగులు
- అగ్రహారం డిగ్రీ కళాశాలలో పెరుగుతున్న ప్రవేశాలు
- పరిశోధనా రంగంలో విద్యార్థుల రాణింపు
- దోస్త్ ద్వారా ప్రవేశాలు..రెండో విడతకు రెడీ



అగ్రహారంలోని సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సిరిసిల్లకల్చరల్: కార్మిక, ధార్మిక క్షేత్రాలను అనుసంధానంగా రెండు ప్రాంతాల విద్యార్థులకు మూడున్నర దశాబ్దాలకు పైగా ఉన్నత విద్యనందిస్తోంది. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ఉన్నతదశలో స్థిరపడ్డారు. నాక్ బీ గ్రేడ్ గుర్తింపుతో అత్యున్నత సౌకర్యాలతో గ్రామీణప్రాంత విద్యార్థుల పాలిట కల్పతరువుగా మారింది. అదే జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని అగ్రహారంలో ఉన్న సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల. విశాలమైన మైదానం, పచ్చని వాతావరణంలో కళాశాల ఉంది. ఆహ్లాదకరమైన పరిసరాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తోంది. అంతర్జాతీయ ఐఎస్‌వో గుర్తింపుతో పాటు నాక్ బీ గ్రేడ్ గుర్తింపుతో ఉన్నత ప్రమాణాలతో అలరారుతోంది. 2018లో 200లోపు ఉన్న విద్యార్థులు క్రమంగా 630కి చేరారు. 1987లో మొదలైన కళాశాల బీఏ, బీకాం కోర్సులతో బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఎస్సీ బీజెడ్‌సీ కోర్సుల్లో మొత్తం 360 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పీజీస్థాయిలో ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్, ఎంకాం కోర్సులకు ఉన్నత విద్యామండలి అనుమతి ఇచ్చింది.

జిజ్ఞాసతో నూతన ఒరవడి

కళాశాల విద్యాశాఖ ప్రవేశపెట్టిన జిజ్ఞాస కార్యక్రమంలో ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈప్రాజెక్టు కింద 2017–18లో జువాలజీ విభాగంలో 2021–22లో ఐదు స్టడీ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో మొదటి రెండు బహుమతులను కైవసం చేసుకోవడం విశేషం. కళాశాల పూర్వవిద్యార్థుల సౌజన్యంతో తలపెట్టిన అకాడమిక్ ఫెస్టివల్ విద్యార్థుల్లో నూతనోత్సాహం నింపుతోంది. మూడేళ్లుగా ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బంగారు పతకాలను బహూకరిస్తున్నారు. విద్యార్థుల్లో విస్తృత పఠనాసక్తి పెంచేందుకు 16 వేల పుస్తకాలతో కూడిన విస్తృత శ్రేణి గ్రంథాలయం ఉంది. పోటీ పరీక్షలకు అవసరమైన అన్నిరకాల గ్రంథాలు ఉద్యోగార్థులైన విద్యార్థులకు పనిచేస్తున్నాయి.



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

అధునాతన ప్రయోగశాలలు

తాజాగా బ్యూటీషియన్, కాస్మెటాలజీ అనే సర్టిఫికెట్ కోర్సులో 250 మంది అధ్యయనం చేస్తున్నారు. ఈ ఏడు బీఎస్సీ స్థాయిలో ఫుడ్‌సైన్స్, క్వాలిటీ కంట్రోల్ అనే కొత్త కోర్సుకు అనుమతి లభించింది. ఆయాకోర్సులకు సంబంధించిన ప్రయోగశాలల్ని అధునాతనంగా తీర్చిదిద్దారు. విస్తృతమైన కంప్యూటర్ ప్రయోగశాలతో పాటు క్లౌడ్ కంప్యూటింగ్‌తో నడిచే ఇతర ప్రయోగశాలలు, కళాశాలలు ప్రత్యేకం.

ఎన్ఎస్ఎస్

హరితహారం, సామాజిక రుగ్మతలపై అవగాహన ర్యాలీలు, రక్తదానం, ఆరోగ్య, వైద్య శిబిరాలు, పచ్చదనం పరిశుభ్రత లాంటి ఎన్నో కార్యక్రమాల్లో సుమారు 200 మంది వలంటీర్లు పలుసమాజ సేవల్లో పాల్గొంటున్నారు. కళాశాలలో అత్యున్నత విద్యార్హతలు గల అధ్యాపకులు ఉన్నారు.

పెరుగుతున్న ప్రవేశాలు

గతంలో పట్టణానికి దూరంగా ఉండడంతో ప్రవేశాలు ఆశించినంత ఉండేవి కావు. విస్తరిస్తున్న పట్టణంగా జిల్లాగా పరిణామం చెందడం, పెరిగిన రవాణా సదుపాయాలతో కళాశాల ఇటు సిరిసిల్ల, అటు వేములవాడ ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. 360 సీట్ల ఇన్‌టెక్‌తో ఉన్న కళాశాలలో ఏటా ప్రవేశాలు పెరుగుతున్నాయి. ఈసారి 250 కి పైగా ప్రవేశాలుపొందుతారని అంచనావేస్తున్నా రు.

ఉద్యోగ మేళాలు..ఉపాధి మార్గాలు

డిగ్రీతో పాటు ఏటా నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలు ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉపాధి మార్గాలను దరిచేరుస్తున్నాయి. టాస్క్ ద్వారా అందిస్తున్న వివిధ ఉద్యోగ సాధన నైపుణ్యాలు కాలానుగుణంగా కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు బాటలు వేస్తున్నాయి.

రిజిస్ట్రేషన్లు ఇలా..

dost.cgg.gov.in దోస్త్ యాప్ ద్వారా, మీ సేవలో, టీ యాప్ ఫోలియో ద్వారా గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తొలి విడతలో రూ.200, రెండో దశ నుంచి ఫీజు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది.

ప్రవేశాలు తీసుకోవచ్చు



నాణ్యమైన విద్య అందుతుందని భావించే విద్యార్థులు దోస్త్ ద్వారా కళాశాలలో ప్రవేశాలు పొందవచ్చు. ఉన్నత విద్యార్హతలు, విస్తృత బోధనా అనుభవం గల లెక్చరర్లు, జాబ్ మేళాలతో రాష్ట్ర స్థాయిలో ఉత్తమఫలితాలు సాధిస్తున్న కళాశాలగా ప్రత్యేక గుర్తింపు పొందింది. పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. నాణ్యమైన విద్య కోరుకునే విద్యార్థులు కళాశాలల్లో ప్రవేశాలు తీసుకోవాలి.

– వడ్లూరి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: అమెరికా పర్యటన ముగించుకొని తిరిగివచ్చిన రాష్ట్ర రవాణా, బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం సిరిసిల్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్ కలిశారు. హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్‌లో పొన్నంకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, నాయకులు ఒగ్గు బాలరాజు, సంతోష్‌గౌడ్, దత్తాద్రి గౌడ్, ఉత్తమ్ అంజయ్య, సుధాకర్‌గౌడ్ తదితరులున్నారు.

బోయినపల్లి: అమెరికా పర్యటన ముగించుకొని రాష్ట్రానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి పొన్నంకు స్వాగతం పలికారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంశీ, అనుముల హరికృష్ణ తదితరులు ఉన్నారు.



బోయినపల్లి: మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

గన్‌పార్క్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మాజీ సీఎం కేసీఆర్ పిలుపుమేరకు మండలంనుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్దకు తరలివెళ్లారు. గన్‌పార్క్ వద్ద అమరవీరులకు కొవ్వొత్తుల భారీ ర్యాలీ ఉండగా, మండలం నుంచి నాయకులు పెద్దఎత్తున వెళ్లారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, నాయకులు అందే సుభాష్, గుల్లపల్లి నర్సింహరెడ్డి, పిల్లి కిషన్, కమ్మరి రాజారాం, శ్రీనివాస్‌రెడ్డి, రాజునాయక్, మధు, కల్యాణ్, నాగరాజు, మునిగె ప్రమోద్, తదితరులున్నారు.



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి



చిరంజీవి (ఫైల్)

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పెద్ది మల్లేశం అలియాస్ చిరంజీవి (45) చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. వారంరోజుల క్రితం చిరంజీవి కల్లు అమ్మేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కూతురు భవాని, కుమారులు అశోక్, సతీశ్ ఉన్నారు. కూతురుకు వివాహం జరిగింది. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..

కోనరావుపేట: మండలంలోని మంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఆది ఆశయ్య (80) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఆశయ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై ఆంజనేయులును వివరణ కోరగా మృతిపై అనుమానాలుండగా పోస్టుమారం కోసం తరలించామని, తెలిపారు. ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విచారణ

ముస్తాబాద్: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన కోడిగుడ్ల పంపిణీపై శనివారం విచారణ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద తెలిపారు. అంగన్‌వాడీకేంద్రాల్లో కొందరికి శుక్రవారం ఇచ్చిన కోడిగుడ్లలో కుళ్లిన గుడ్లు వచ్చాయన్న ఆరోపణల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాలింతలు, గర్భిణులకు తాజాగా కోడిగుడ్లు అందించినట్లు తెలిపారు. వేసవి కావడంతో గుడ్లు కుళ్లిపోతున్నాయన్నారు. టీచర్లు, ఆయాలు కోడిగుడ్లను పరిశీలించాకే లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఇక్కడ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెన్నమనేని వంశీకృష్ణరావు, ఉపాధ్యక్షుడిగా ఇరుమల్ల తిరుపతి, పాలకవర్గ సభ్యులుగా గంగుల పర్శరాములు, బోనాల పునీత్, దామరపల్లి శ్రీనివాస్, కొత్తకొండ గౌరయ్య, మోకెనపల్లి మల్లయ్య, బందం అంజయ్య. ఓరుగంటి రాజనర్సు, గొట్టిపర్తి పర్శరాములు, ఐదరి శ్రీనివాస్, లక్ష్మణ్, ముత్యం, బాలయ్య, రఘుపతిరావు, విజయ్‌కుమార్, పర్శరాములు, సత్తయ్య, మల్లేశం, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, నరేశ్, అనిల్, దేవరాజు తదితరులు ఎన్నికయ్యారు.

విద్యుత్ వైర్లపై పడిన రేకులు

- త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద ఓ లాండ్రి దుకాణంపై ఉన్న రేకులు ఈదురుగాలులకు శనివారం విద్యుత్ వైర్లపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ వైర్లు ఒక్కసారిగా తెగిపడడంతో పెద్దశబ్దం వచ్చి మంటలువ్యాపించాయి. సమాచారం అందుకున్న సెస్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా హనుమాన్ జయంతి



వేములవాడరూరల్: హనుమాన్ ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్



బోయినపల్లి: వరదవెల్లిలో హనుమాన్ శోభాయాత్ర



ముస్తాబాద్: మద్దికుంటలో కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు



కోనరావుపేటలో హనుమాన్ శోభాయాత్ర

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లిలో శనివారం పెద్ద హనుమాన్ జయంతి నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, సామ తిరుపతిరెడ్డి, అడ్డిక జైపాల్‌రెడ్డి, బింగి మహేశ్, సంగ స్వామి తదితరులు ఉన్నారు.

పొత్తూరులో

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పొత్తూరులో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముస్తాబాద్: హనుమాన్ జయంతి సందర్భంగా ముస్తాబాద్ మంగళగడ్డ హనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. మద్దికుంట హనుమాన్ ఆలయంలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. భక్తులకు ఎంపీపీ శరత్‌రావు అన్నదానం చేశారు. ఆవునూర్, పోతుగల్, నామాపూర్, గూడెం, కొండాపూర్ తదితర గ్రామాల్లో ఆలయాల్లో పూజలు చేశారు.

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శనివారం రాత్రి హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించారు. పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో అభిషేకాలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా 587 కేంద్రాలు
- జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం



సెక్టార్ సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 587 అంగన్‌వాడీ కేంద్రాలను మే 1వ తేదీ నుంచి ఒక్కపూట నిర్వహించామని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఒక పూట బడి నిర్వహిస్తూ అంగన్‌వాడీ ఆయాకు 15 రోజులు, టీచర్‌కు 15 రోజులు చొప్పున సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా కుటుంబ సర్వే నిర్వహించాల్సి ఉందని, దానిలో భాగంగా సెక్టార్ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. తంగళ్లపల్లిలో స్థానిక వైద్యాధికారి దీప్తి పాల్గొని మహిళల్లో వస్తున్న గర్భాశయం, బ్రెస్ట్ క్యాన్సర్‌ల గురించి అవగాహన కల్పించినట్లు వివరించారు. వేములవాడ మండలం చెక్కపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, తంగళ్లపల్లిలో సీడీపీవో అలేఖ్య, సూపర్‌వైజర్ సుస్మిత, డీ–హబ్ కోఆర్డినేటర్ రోజా, జెండర్ స్పెషలిస్ట్ దేవిక పాల్గొన్నారు.

‘నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు’



వేములవాడ రూరల్ : ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

వేములవాడరూరల్: నకిలీ విత్తనాలు అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెక్కపల్లి, వట్టెంలలోని ఫర్టిలైజర్ షాపులు, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాల విక్రయాల్లో తరచూ కేసులు నమోదైతే పీడీయాక్ట్ అమలు చేస్తామన్నారు. ఫర్టిలైజర్, సీడ్స్ షాప్స్‌పై నిఘా ఉంచి నకిలీ విత్తనాల విక్రయాలు, రవాణాకు అరికట్ట వేస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే రసీదు తీసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

బోయినపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పుష్పలత హెచ్చరించారు. ఎంఏవో ప్రణీత, ఏఎస్సై మోతీరామ్‌తో కలిసి మండలంలోని కొదురుపాక, స్తంభంపల్లి, బోయినపల్లి, వెంకట్రావుపల్లి తదితర గ్రామాల్లోని విత్తన దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు.

వీర్నపల్లి: రైతులకు కల్తీ విత్తనాలను విక్రయించవద్దని ఎస్సై రమేశ్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ చేశారు. నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులను ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు.

కోనరావుపేట: మండలకేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న పిచికారీ మందులు, ఎరువుల వివరాలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్‌లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలన్నారు. ఎస్సై రమాకాంత్, హెచ్‌సీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

వీర్నపల్లి : మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జగదాంబ ఆలయం వద్ద శుక్రవారం జేసీబీ సహాయంతో మిషన్ భగీరథ పైపులు ధ్వంసం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన నూనవత్ సదర్, నూనవత్ రాజం ఉద్దేశపూర్వకంగా పైపులు పగలగొట్టారన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని లగిశెట్టి విశ్వనాథం అనాథ వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పండ్లు పంపిణీ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు పర్శ హన్మండ్లు పుట్టినరోజును ఘనంగా నిర్వహించి పండ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు భిక్షపతి, నరేశ్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



చెక్కపల్లి విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం చెక్కపల్లిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్‌లో చెక్కపల్లి, నూకలమర్రి జట్లు తలపడగా విజేతగా చెక్కపల్లి, రెండో స్థానంలో నూకలమర్రి, మూడో స్థానంలో చెక్కపల్లి, నాల్గో స్థానంలో గట్లనర్సింగాపూర్ జట్లు నిలిచాయి. ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. మాజీ సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, వకుళాభరణం శ్రీనివాస్, శ్రీకుమార్, సంగ స్వామి, పుల్కం రాజు, రవి, వెలుమ బాల్‌రెడ్డి, సోయినేని కరుణాకర్ పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు.. రైతుకు గాయాలు



మంటల్లో కాలిపోతున్న గడ్డి

కోనరావుపేట(వేములవాడ): వరికొయ్యలకు నిప్పంటించగా మంటలు చెలరేగి, ఎడ్లబండి, మోటార్ పైపులు కాలి, రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం .. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లికి చెందిన జవ్వాజి మల్లయ్య అనే రైతు శనివారం మధ్యాహ్నం తన పొలంలో వరికొయ్యలను నిప్పుపెట్టాడు. మంటలు చెలరేగి, గడ్డివాముకు అంటుకున్నాయి. ఈ ఘటనలో అక్కడే ఉన్న ఎడ్లబండి, మోటార్ పైపులు దగ్ధమయ్యాయి. మల్లయ్యకు తీవ్ర గాయాలవగా కుటుంబసభ్యులు వేములవాడ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.